ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు మహర్దశ

చాంద్రాయణగుట్ట: నిత్యం ప్రయాణికులతో రద్దీతో కిటకిటలాడే ఉప్పుగూడ రైల్వే స్టేషన్ ముఖచిత్రం ఇకపై మారనుంది. అమృత్ భారత్ స్టేషన్ల పథకంలో భాగంగా ఈ స్టేషన్‌ను రూ.26.80 కోట్లతో సర్వాంగ సుందరంగా ఆధునీకరించనున్నారు. ఉప్పుగూడతో పాటు పాతబస్తీలో ఫలక్‌నుమా, యాకుత్‌పురా, డబీర్‌పురా స్టేషన్లు ఉన్నప్పటికీ రైల్వే శాఖకు అధిక ఆదాయం ఇచ్చే స్టేషన్ కావడంతో ఈ స్టేషన్ ఆధునీకరణకు రైల్వేశాఖ నిర్ణయం తీసుకుంది. అధునాతన సొబగులద్దుకోనున్న ఈ నిర్మాణ పనులకు ఈనెల 6న ప్రధాని నరేంద్ర మోదీ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు.

మొదటి దశలోనే..

అమృత్ భారత్ స్టేషన్లలో భాగంగా 39 రైల్వే స్టేషన్లను ప్రకటించగా..అందులో తొలి దశలోనే ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించనున్నారు. అంతర్జాతీయ హంగులతో మాల్స్, హోటళ్లు, ప్రయాణికులకు అన్ని రకాలు సదుపాయాలు కల్పించనున్నారు. నగర చారిత్రక, జీవన విధానాన్ని ప్రతిబింబించేలా తీర్చిదిద్దనున్నారు. స్టేషన్ ఆవరణలో పార్కు, వాహనాల పార్కింగ్‌తో పాటు అన్ని రకాల సదుపాయాలు సమకూర్చనున్నారు.



ఆధునీకరణకు నోచుకోనున్న ఉప్పుగూడ రైల్వేస్టేషన్

- ఇకపై సిటీ సెంటర్‌గా మారనున్న స్టేషన్
- అమృత్ భారత్ స్టేషన్‌లో భాగంగా రూ.26.80 కోట్లు మంజూరు
- నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న ప్రధాని నరేంద్ర మోదీ

ఇప్పటికే రెండు వంతెనల నిర్మాణం..

ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌కు ఇరువైపులా వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఇప్పటికే వంతెనలను సైతం నిర్మించారు. ఛత్రినాక నుంచి ఉప్పుగూడ వైపుకు రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ), ఛత్రినాక నుంచి చాంద్రాయణగుట్ట రూట్‌లో రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్‌ఓబీ)లు నిర్మించబడ్డాయి. రైల్వే గేట్ల వద్ద రోజురోజుకూ పెరుగుతున్న వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకొని మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డి ఈ వంతెనల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు.

రైలు నిండాలన్నా.. ఖాళీ కావాలన్నా..

ఉదయం నుంచి రాత్రి వరకు ఏ రైలు ప్రయాణికులతో నిండిపోవాలన్నా.. ఖాళీగా కావాలన్నా ఈ స్టేషన్‌లోనే కనిపిస్తుంది. పేద, మధ్య తరగతి ప్రజలు నివాసం అధికంగా ఉండే ఈ స్టేషన్ పరిసరాలలో నిత్యం వేలాది మంది ఉద్యోగాల నిమిత్తం నగరానికి వెళ్లేందుకు రైళ్లనే ఆశ్రయిస్తుంటారు. ఉదయం పూట 7 నుంచి 10 గంటల వరకు ఏ రైలు చూసినా కళాశాల విద్యార్థులతో కళకళలాడుతూ కనిపిస్తుంది. జేబీఎస్ నుంచి ఫలక్‌నుమా వరకు రావాల్సిన మెట్రో రైలు సైతం ఎంజీబీఎస్ వరకే పరిమితం కావడంతో ఈ ప్రాంతంలో ఎంఎంటీఎస్‌కు రద్దీ కొనసాగుతూ వస్తుంది.

“ ఎంతో మందికి జీవనోపాధి లభించనుంది..



ఉప్పుగూడ రైల్వేస్టేషన్‌ను అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఎంపిక చేయడం హర్షణీయం. నిత్యం వేలాది మంది ప్రయాణికులతో రైల్వే శాఖకు ఆదాయం కల్పిస్తున్న ఈ స్టేషన్‌ను రూ.26.80 కోట్లతో అభివృద్ధి చేయడం సముచితంగా న్యాయం చేసినట్లవుతుంది. పాతబస్తీలోని రైల్వేస్టేషన్‌ను ఆధునీకరించేందుకు బీజేపీ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడం పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఆధునీకరణతో ప్రత్యక్షంగా, పరోక్షంగా స్థానిక ప్రజలలో ఎంతో మందికి జీవనోపాధి లభించనుంది.

– ఎడ్ల పందరీనాథ్, లలితాబాగ్

క్లుప్తంగా...

జియాగూడ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా బాబు



జియాగూడ: జియాగూడ డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడిగా సి.బాబును నియమించినట్లు కార్వాన్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ ఇన్‌చార్జ్ జీవన్‌సింగ్ తెలిపారు. ఈ మేరకు ఆయన బాబుకు నియామక పత్రాన్ని విడుదల చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బాబు ఉద్యమ కాలం నాటి నుంచి పనిచేస్తూ ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు అందేలా కృషి చేస్తున్నాడన్నారు. అనంతరం బాబు మాట్లాడుతూ.. నిరుపేదలకు కేసీఆర్ సంక్షేమ పథకాలు అందే విధంగా కృషిచేస్తూ రాబోయే ఎన్నికలకు పార్టీ విజయానికి తనవంతు సహకారం అందిస్తానన్నారు.

ఆర్టీసీ కార్మికుల ఆందోళన



ఫారూక్‌నగర్ డిపో ముందు నిరసన తెలుపుతున్న కార్మికులు

చాంద్రాయణగుట్ట: ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లుకు గవర్నర్ ఆమోదం తెలపకపోవడం పట్ల ఫారూక్‌నగర్ బస్సు డిపో కార్మికులు శనివారం ఆందోళనకు దిగారు. ఉదయం డిపో గేట్ ముందు విధుల్లో చేరకుండా గవర్నర్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ ఉద్యమంలో ఎంతో పోరాటం చేసిన తమ సేవలను గుర్తించి..రాష్ట్ర ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకోగా..అసెంబ్లీలో బిల్లు ప్రవేశపెట్టడానికి గవర్నర్ ఆమోదం తెలపకపోవడం సరైంది కాదన్నారు.

మిధాని ఆర్టీసీ ఉద్యోగులు..

సంతోష్‌నగర్: ప్రభుత్వంలో ఆర్టీసీ కార్మికులను విలీనం బిల్లును గవర్నర్ తమిళిసై పరిశీలన కోసం ఆపడాన్ని నిరసిస్తూ మిధాని ఆర్టీసీ కార్మికులు శనివారం ఉదయం 6 నుంచి 8 గంటల వరకు తమ నిరసన వ్యక్తం చేస్తూ ఆందోళన చేపట్టారు. ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసే బిల్లును శాసనసభలో ప్రవేశపెట్టేందుకు గవర్నర్ వెంటనే అనుమతి ఇవ్వాలని డిమాండ్ చేశారు.

కేసీఆర్ 33 అడుగుల కటౌట్‌కు పాలాభిషేకం



పాలాభిషేకం చేస్తున్న మమతా గుప్తా

అబిడ్స్: సీఎం కేసీఆర్ 33 అడుగుల భారీ కటౌట్‌కు పాలాభిషేకం చేశారు. శనివారం బేగంబజార్ ఎంజే బ్రిడ్జి వద్ద నగర గ్రంథాలయ శాఖ డైరెక్టర్, మాజీ కార్పొరేటర్ మమతాగుప్తాతో పాటు బీఆర్‌ఎస్ గోషామహల్ నియోజకవర్గం నాయకులు ప్రేమ్‌సింగ్ రాథోడ్, ఆనంద్‌కుమార్ గౌడ్, సంతోష్‌గుప్తా, శాంతి దేవి, ఆర్.మహేందర్ కుమార్, జయశంకర్, శంకర్, మాణిక్‌రావు, రమేష్‌గుప్తాతో పాటు నాయకులు పాల్గొని పాలాభిషేకం నిర్వహించారు. 43 వేల ఆర్టీసీ కార్మికులకు ప్రభుత్వ ఉద్యోగులుగా ప్రకటించడం, మెట్రో రైల్‌ను గ్రేటర్‌కు ఇరువైపులా విస్తరించడం సీఎం కేసీఆర్‌కే దక్కిందని మమతాగుప్తాతో పాటు పలువురు నాయకులు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



లబ్ధిదారుడికి చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: అర్హులైన పేదలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. శనివారం ఆయన టోలిచౌకిలోని తన కార్యాలయంలో పలు పేద కుటుంబాలకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి పథకం పేద వారికి శస్త్ర చికిత్సలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. ఈ పథకానికి నేరుగా తన కార్యాలయానికి వచ్చి దరఖాస్తు చేసుకోవాలని దానిని వెంటనే ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపి అవసరమైన డబ్బులు లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకుంటానని ఆయన అన్నారు.

పుస్తకావిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు

గన్‌ఫౌండ్రీ: సాహితీ వేత్తలు కదిలే విజ్ఞాన గ్రంథాలాంటి వారని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శనివారం రవీంద్రభారతిలో తెలుగు భాషా చైతన్య సమితి, నెలపొడుపు సాహిత్య సాంస్కృతిక వేదిక, కుసుమ ధర్మన్న కళాపీఠంల ఆధ్వర్యంలో ప్రముఖ రచయిత కర్నాటి రఘురాములుగౌడ్ రచించిన జాగృతి తేజాలు పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కవి సమ్మేళనం ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సాహిత్య అకాడమి అధ్యక్షుడు జూలూరి గౌరీశంకర్, ఓయూ విశ్రాంత ప్రొఫెసర్ కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, తెలుగు విశ్వ విద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య గౌరిశంకర్, తెలుగు భాషా చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు బడేసాబ్ పాల్గొన్నారు.

వైద్యుల సమస్యలను పరిష్కరించాలి



సుల్తాన్‌బజార్: రెవెన్యూ అధికారుల పెత్తనాన్ని సహించేది లేదని తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం రాష్ట్ర ప్రతినిధులు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కోఠిలోని డీఎంహెచ్‌ఎస్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో తెలంగాణ ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ బొంగు రమేష్, పల్లం ప్రవీణ్, డాక్టర్ లాలుప్రసాద్ రాథోడ్, డాక్టర్ నరహరి మాట్లాడారు. దీర్ఘకాలికంగా పెండింగ్‌లో ఉన్న వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని వైద్యుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. వైద్య ఆరోగ్యశాఖపై కొందరు రెవెన్యూ అధికారులు పెత్తనాన్ని చెలాయిస్తున్నారని దీనిని మేము సహించేది లేదన్నారు. ఆస్పత్రిలో సూపరింటెండెంట్‌తో పాటు అడ్మినిస్ట్రేషన్ విషయంలో ఆర్డీఓల సేవలను వినియోగించుకోవాలని శుక్రవారం అసెంబ్లీలో వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీష్‌రావు చేసిన తీర్మానాన్ని వెనక్కి తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ప్రభుత్వ వైద్యుల సంఘం ప్రతినిధులు డాక్టర్ అజ్మీర రంగ, డాక్టర్ ఉమాకాంత్‌గౌడ్, డాక్టర్ రాజు, డాక్టర్ వినోద్, డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ శేఖర్, డాక్టర్ భూపేందర్ రాథోడ్, డాక్టర్ రమేష్, అబ్బయ్య, వసంత్, శ్రీకాంత్, రాజశ్రీ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నృత్య ప్రదర్శన



గన్‌ఫౌండ్రీ: శృతిలయ కేంద్ర నాట్యాలయ ఆధ్వర్యంలో ప్రముఖ నృత్య గురువు డాక్టర్ రాజేశ్వరీ సాయినాథ్, వైష్ణవి సాయినాథ్ శిష్యురాలు ఎస్.గాయత్రి భరతనాట్య అరంగేట్రం శనివారం రవీంద్రభారతిలో కనుల పండువగా జరిగింది. పుష్పాంజలి, దేవిస్తుతి, పంచరత్న కీర్తి, అన్నమాచార్య కీర్తన, శివ స్తుతి, మంగళం వంటి పలు అంశాలపై చక్కటి హావభావాలతో సాగిన నృత్య ప్రదర్శన ఆహుతులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కేవీ.రమణాచారి, సాంస్కృతిక శాఖ ముఖ్య కార్యదర్శి శైలజ రామయ్యర్, హైదరాబాద్ బ్రదర్స్ డి.రాఘవాచారి, శేషాచారి, విశ్రాంత ఐఏఎస్ అధికారి డాక్టర్ మోహన్‌కంద తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలకు సన్నాహాలు



సమావేశంలో నందకిశోర్‌యాదవ్, నరేందర్‌యాదవ్ తదితరులు

అబిడ్స్: ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలను సెప్టెంబర్ 6న చేపట్టేందుకు పెద్ద ఎత్తున సన్నాహాలు చేస్తున్నామని గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం చైర్మన్ చిట్టబోయిన నందకిశోర్ యాదవ్, యాదవ సంఘం రాష్ట్ర నాయకుడు వి.పాండు యాదవ్‌వు పేర్కొన్నారు. ఈ వేడుకలకు ఆహ్వాన కమిటీ చైర్మన్‌గా నరేందర్‌యాదవ్‌ను నియమించినట్లు వెల్లడించారు. యాదవ సంఘంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. ఆహ్వాన కమిటీ చైర్మన్, ఇతర ఆహ్వాన కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున వేడుకలు చేపడుతామన్నారు. నూతన ఆహ్వాన కమిటీ చైర్మన్ నరేందర్‌యాదవ్ మాట్లాడుతూ.. పార్టీలకు అతీతంగా రాష్ట్రంలో అతిపెద్ద వేడుకలు జాంబాగ్‌లో నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్ యాదవ్, బోయిని వెంకటేష్ యాదవ్, మనీష్ యాదవ్, శైలేందర్ యాదవ్, రాజేందర్ యాదవ్, శ్రీనివాస్ యాదవ్, రమేష్ యాదవ్, దేవేందర్ యాదవ్, నర్సింగ్ యాదవ్, మల్లికార్జున్‌యాదవ్ పాల్గొన్నారు.

ఫ్రెండ్లీ పోలీసింగ్ విజయవంతం



గోల్కొండ: ఫ్రెండ్లీ పోలీసింగ్ పూర్తిగా విజయవంతం అయిందని గోల్కొండ జోన్ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శనివారం ఆయనను పలువురు న్యాయవాదులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పోలీసులు, న్యాయవాదుల మధ్య విడదీయరాని అనుబంధం ఉందన్నారు. నేరస్తులను పట్టుకోవడం పోలీసుల పని అయితే కోర్టులో వారిని శిక్ష పేడలా చూడడం న్యాయవాదుల వంతని ఆయన అన్నారు. అత్యాధునిక టెక్నాలజీతో నేరగాళ్లను పట్టుకోవడంలో పోలీసులు ప్రశంసనీయంగా పని చేస్తున్నారన్నారు. మరోవైపు డ్రగ్ ఫ్రీ తెలంగాణను విజయవంతం చేయడంలో పోలీసులు పూర్తిగా విజయం సాధించారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాది మిర్జా ఎక్బాల్ అహ్మద్, ఆబేద్ తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

గన్‌ఫౌండ్రీ: ప్రభుత్వ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని టీఎన్జీఓస్ నగర అధ్యక్షుడు ముజీబ్ తెలిపారు. టీఎన్జీఓస్ నగరశాఖ ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన ఉద్యోగుల సమస్యల పరిష్కార సభ విజయవంతం కావడానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు శనివారం టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర అధ్యక్షుడు కేఆర్.రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర సంఘం నాయకులను ఘనంగా సన్మానించారు. అనంతరం విద్యాశాఖలో ఉన్న పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. టీఎన్జీఓస్ పాఠశాల విద్యాశాఖ విభాగం నగర కార్యదర్శి కేఆర్.రాజ్‌కుమార్, ఉపాధ్యక్షులు రవికుమార్, ముక్తాధర్ పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి చెల్లించాలి



వినతిపత్రం అందజేస్తున్న శివచంద్రగిరి తదితరులు

గౌలిపురా: నిరుద్యోగ యువతకు నిరుద్యోగ భృతి చెల్లించాలని బీజేపీ యువ మోర్చా భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు శివచంద్రగిరి కోరారు. ఈ మేరకు శివచంద్రగిరి ఆధ్వర్యంలో శనివారం హైదరాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ మధుసూదన్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10 ఏళ్లుగా ఉద్యోగ నియామకాలు, లేక నిరుద్యోగ భృతిపై ఎటువంటి నిధులు ప్రకటన చేయకుండా బీఆర్‌ఎస్ ప్రభుత్వం మోసం చేస్తుందన్నారు. వచ్చే ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామన్నారు. ఈ కార్యక్రమంలో యువ మోర్చా రాష్ట్ర నాయకులు రమణ్‌సింగ్, జిల్లా ప్రధాన కార్యదర్శులు భారత్ కుమార్, జగన్‌మోహన్, ఉపాధ్యక్షులు అభిలాష్ కుమార్, కార్యదర్శులు వెంకట్, కన్వీనర్లు ఈశ్వర్ యాదవ్, దయాకర్ పాల్గొన్నారు.

ఫర్నిచర్ దుకాణంలో అగ్నిప్రమాదం



దూద్‌బౌలి: హుస్సేనీఆలం కోకాకీ తట్టీ ప్రాంతంలో ఓ ఫర్నిచర్ షాపునకు చెందిన గోడౌన్‌లో శనివారం అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో వెంటనే పోలీసులు అగ్నిమాపక కేంద్రం సిబ్బంది, రెండు ఫైరింజన్లతో మంటలను ఆర్పివేశారు. హుస్సేనీఆలం ఎస్సై నవీన్ తెలిపిన వివరాల ప్రకారం.. నాంపల్లిలోని దీపక్ ఫర్నిచర్ షాపునకు చెందిన గోడౌన్‌ను హుస్సేనీఆలంలోని కోకాకీతట్టీ ప్రాంతంలో ఏర్పాటు చేసుకున్నారు. శనివారం తెల్లవారుజామున ప్రమాదవశాత్తు షార్ట్ సర్క్యూట్‌తో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. యజమాని దీపక్ మాట్లాడుతూ.. ఈ గోడౌన్‌లో ఎలాంటి విలువైన సామగ్రి లేదని.. ఆరేళ్లుగా మూతపడి ఉందని తెలిపారు. ఇందులో తమకు ఎలాంటి ఆస్తి, ప్రాణనష్టం జరగలేదన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



వేడుకల్లో ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ షమీలారెడ్డి

అబిడ్స్: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని సౌత్‌వెస్ట్ జోన్ ట్రాఫిక్ ఏసీపీ డి.ధనలక్ష్మి అన్నారు. శనివారం ఆగాపురాలోని గౌతమ్‌మోడల్ స్కూల్‌లో ప్రిన్సిపాల్ షమీలారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన ఇన్వెస్టిట్యూర్ క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమె మాట్లాడుతూ.. విద్యార్థి దశ ప్రతి ఒక్కరికి జీవితంలో ఎంతో ముఖ్యమన్నారు. ప్రిన్సిపాల్ షమీలా రెడ్డి మాట్లాడుతూ.. తమ జీఎంఎస్ యాజమాన్యం విద్యార్థులు ప్రతి రంగంలో రాణించే విధంగా ప్రత్యేక అవగాహన కల్పిస్తామన్నారు. నాణ్యమైన విద్యను బోధిస్తూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దుతున్నట్లు వెల్లడించారు. క్యాబినెట్ ఇన్‌స్టాలేషన్‌లో వలు తరగతుల్లో ఎంపికైన వారికి ఏసీపీ ధనలక్ష్మి, ప్రిన్సిపాల్ షమీలా రెడ్డి బ్యాడ్జీలు అందజేసి అభినందించారు.

ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడాలి



చెక్కులను అందజేస్తున్న పంకజ్ కుమార్ అగర్వాల్, మహారాజ్ ఆచార్య సుమీత్ కృష్ణజీ

చార్మినార్: ఉన్నత విద్యనభ్యసించి జీవితంలో స్థిరపడాలని హైదరాబాద్, సికింద్రాబాద్ నార్నూల్ అగర్వాల్ సమితి అధ్యక్షుడు పంకజ్‌కుమార్ అగర్వాల్ అన్నారు. శనివారం నార్నూల్ అగర్వాల్ సమాజానికి చెందిన విద్యార్థులకు ఆర్థిక సాయం కింద ఉత్తర్ ప్రదేశ్‌లోని బృందావన్‌కు చెందిన శ్రీమత్ భాగవత్ వక్త మహారాజ్ ఆచార్య సుమీత్ కృష్ణజీతో కలిసి చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా పంకజ్‌కుమార్ అగర్వాల్ మాట్లాడుతూ.. పడో..లికో..ఆగే బడో అనే కార్యక్రమంలో భాగంగా పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందజేస్తున్నామన్నారు. రవీంద్రకుమార్ అగర్వాల్, డాక్టర్ సరితా అగర్వాల్, అనుప్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌పై సమీక్షా సమావేశం



మాట్లాడుతున్న ప్రేమావతి

నాంపల్లి: జాతీయ లోక్ అదాలత్ సెప్టెంబర్ 9న జరుగుతుందని, ఈ అదాలత్‌ను దిగ్విజయం చేయాలని మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ చైర్‌పర్సన్ ప్రేమావతి పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం నాంపల్లి కోర్టులో జాతీయ లోక్ అదాలత్‌పైన వివిధ బ్యాంకుల అధికారులు, ప్రతినిధులతో ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ప్రేమావతి మాట్లాడుతూ.. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ న్యూఢిల్లీ వారి ఆదేశాల మేరకు మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ ఆధ్వర్యంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సమావేశంలో మెట్రోపాలిటన్ న్యాయ సేవాధికార సంస్థ హైదరాబాద్ కార్యదర్శి రాధిక జైస్వాల్, రెండవ అదనపు మెట్రోపాలిటన్ సెషన్స్ జడ్జి భూపతి, మెట్రోపాలిటన్ క్రిమినల్ కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షులు కిరణ్‌కుమార్, సికింద్రాబాద్ కోర్టు కాంప్లెక్స్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు చంద్రశేఖర్, బ్యాంకు కోఆర్డినేటర్లు, మేనేజర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ సంబరాలు



మిఠాయిలు పంచుతున్న కాంగ్రెస్ నాయకులు

జియాగూడ: రాహుల్ గాంధీకి పరువునష్టం కేసులో భారీ ఊరట లభించడం సుభసూచకమని కార్వాన్ నియోజకవర్గం పార్టీ ఇన్‌చార్జ్ ఉస్మాన్ అలీ హజ్రి అన్నారు. ఈ మేరకు శనివారం జియాగూడలో డివిజన్ అధ్యక్షుడు దర్శన్‌కుమార్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టారు. గుడిమాల్కాపూర్ డివిజన్ అధ్యక్షుడు దుర్గా ప్రసాద్, నాయకులు మహ్మద్ నవాజ్, ఖలీం, సలీం, రాకేష్, హరికిషన్, సాయి, మంజు పాల్గొన్నారు.

సత్కారం



అబిడ్స్: ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్‌ను గోషామహల్ నియోజకవర్గం బీఆర్‌ఎస్ నాయకుడు ఆల పురుషోత్తమ్‌రావు, రాంచంద్రరాజ్ ఘనంగా సత్కారం చేశారు. నూతనంగా ఎమ్మెల్సీగా నియమితులైన ఆయనను సత్కరించి అభినందనలు తెలిపారు. వారు మాట్లాడుతూ.. ఉద్యమ నాయకులకు సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ అనుకున్న స్థాయిలో ప్రోత్సాహం ఇస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలో, బంగారు తెలంగాణ స్థాపనలో దాసోజ్ శ్రవణ్ చేస్తున్న కృషి అమోఘమని కొనియాడారు.

గుండె సంరక్షణకు ‘దిగ్విజయ్ పల్సరియో’ అద్భుతమైన సాధనం

నాంపల్లి: గుండె సంరక్షణకు ‘దిగ్విజయ్ పల్సరియో’ అద్భుతమైన సాధనమని ప్రముఖ వైద్య రంగ నిపుణుడు డాక్టర్ వై.మోహిత్‌కుమార్ అన్నారు. శనివారం ఓ ప్రైవేట్ హోటల్‌లో నిమ్స్ సీటీ హెచ్‌ఓడీ డాక్టర్ అమరేష్‌తో కలిసి ‘దిగ్విజయ్ పల్సరియో’ పరికరాన్ని ఆవిష్కరించిన ఆయన ప్రసంగించారు. బ్లూటూత్‌తో కనెక్ట్ చేయబడిన దేహ సంరక్షణలో పల్సరియో వ్యవస్థ ఒకటని అన్నారు. డాక్టర్ అమరేష్ మాట్లాడుతూ.. స్మార్ట్‌ఫోన్ యాప్‌కు పల్సరియోను అనుసంధానం చేసి మన ఆరోగ్య డేటాను మూల్యాంకనం చేసుకోవచ్చని తెలిపారు. వైద్య రంగ నిపుణులు డాక్టర్ కెవిన్ కొర్‌విల్లే, డాక్టర్ జెఫ్రీ ఫ్రాంక్, స్టేసీ స్టిగ్స్, అనంతరామ్, రాజేంద్ర ప్రసాద్, ఎస్.రమేష్ పాల్గొన్నారు.

ముగిసిన జాతీయ సదస్సు

సుల్తాన్‌బజార్: కాలిన గాయాలతో చెవులు, ముక్కును కోల్పోయిన వారికి తిరిగి పునరుద్ధరణ వంటి అంశాలపై నేటి తరం యువ వైద్యులకు ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చేందుకు ఇలాంటి జాతీయ సదస్సును నిర్వహించామని ఆ సదస్సు ప్రధాన కార్యదర్శి ఉస్మానియా మెడికల్ కళాశాల ప్లాస్టిక్ సర్జరీ విభాగం ప్రొ. డాక్టర్ పలుకూరి లక్ష్మి పేర్కొన్నారు. శనివారం ఉస్మానియా మెడికల్ కళాశాలలో నేషనల్ అకాడమి ఆఫ్ బర్న్స్ ఇండియా, ఉస్మానియా మెడికల్ కళాశాల ప్లాస్టిక్ సర్జరీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ఈ జాతీయ సదస్సు ముగిసింది. ఆమె మాట్లాడుతూ.. ఓఎంసీ 1973లో ప్లాస్టిక్ సర్జరి విభాగం ప్రారంభం కావడంతో 2023 సంవత్సరానికి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా గోల్డెన్‌జూబ్లీ వేడుకల్లో భాగంగా ఈ సదస్సును నిర్వహించడం జరిగిందన్నారు. డాక్టర్ శోభా చామియాన్, డా.లిఖిత, డా.ఫారూఖి, డా.రోహిత్ పాల్గొన్నారు.